సాక్షి
వైఎస్సార్ జిల్లా
మంగళవారం। 11। ఏప్రిల్। 2023



వైఎస్సార్‌సీపీ నాయకుడి హత్య కేసులో 8 మంది అరెస్ట్
కమలాపురానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కె. జయ శంకర్‌రెడ్డి హత్య కేసులో 8 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



'గంజాయి'పై గట్టి నిఘా
జిల్లాలో గంజాయి స్మగ్లర్లపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. గంజాయిని పెంచుతున్న, అక్రమ రవాణా, కొనుగోలు చేస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. - 10లో



వందేళ్ల సబ్‌కలెక్టరేట్..
వైఎస్సార్ జిల్లాలో ఉన్నప్పుడు కలెక్టరేట్ తర్వాత సబ్‌కలెక్టరేట్ స్థానం రాజంపేటది. ప్రస్తుతం ఇది వందేళ్లు పూర్తి చేసుకుంది.చరిత్రాత్మక కట్టడంగా మిగిలిపోయింది.. - 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళ (సాా)	సహర్ బుధ (ఉా)
కడప	6.31	4.50
ప్రొద్దుటూరు	6.30	4.52
పులివెందుల	6.34	4.55

న్యూస్‌రీల్

172 మంది గైర్హాజరు



పరీక్షకు హాజరైన విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా సోమవారం నిర్వహించిన పది మ్యాథమాటిక్స్ పరీక్షకు 172 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలోని 146 పరీక్షా కేంద్రాల్లో 27924 మంది హాజరు కావాల్సి ఉండగా 27552 మంది హాజరయ్యారు. జిల్లాలోని 56 పరీక్షా కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్, తొమ్మిదింటిని డీఈఓ రాఘవరెడ్డి, మరో నాలుగు పరీక్షా కేంద్రాలను పది పరీక్షల జిల్లా అబ్జర్వర్ వెంకటకృష్ణారెడ్డి తనిఖీ చేశారు. జిల్లాలో ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈఓ తెలిపారు.

13న డీలర్లు హాజరుకావాలి

కడప అగ్రికల్చర్ : 2022–23 సంవత్సరానికి గాను జిల్లాలో వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు రాయితీపై సరఫరా చేసేందుకు ఆసక్తి ఉన్న డీలర్లు ఈ నెల 13వ తేదీన ఉదయం 10 గంటలకు జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయానికి రావాలని జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరావు తెలిపారు. సదరు డీలర్లు మూడు బిల్లులతో రావాలన్నారు. జిల్లా ధరల పర్యవేక్షణ కమిటీ(డీపీఎంసీ) ద్వారా ధరలు నిర్ధారణ చేయనున్నట్లు తెలిపారు.

15న జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్ష

కడప అర్బన్ : కడప జిల్లా బార్ అసోసియేషన్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) ఆధ్వర్యంలో సంయుక్తంగా జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్షను ఈనెల 15న కడపలోని జిల్లాకోర్టు కాంప్లెక్స్‌లో నిర్వహించనున్నారు.ఈ విషయాన్ని కడప న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జీ.వి రాఘవరెడ్డి, భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి. సుబ్రమణ్యం విలేకరులకు తెలియజేశారు. అభ్యర్థులు ముందుగా తమ పేర్లను 94402 10558 నంబరులో సంప్రదించి నమోదు చేసుకోవాలన్నారు. అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) నాయకులు ఎల్. నాగసుబ్బారెడ్డి, జీ.వి. మారుతీ రెడ్డి, ఏ.వి. శివరామ్, న్యాయవాదులు వి.. రాజగోపాల్‌రెడ్డి, ఐ. రాజా పాల్గొన్నారు.

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

కడప అర్బన్ : జిల్లాలో బాధితులు పోలీసుశాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో 'స్పందన'కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ బాధితులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. 'స్పందన'ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించాలని ఎస్పీ పేర్కొన్నారు.

ఆర్‌కే వ్యాలీ ఏఓగా రాంభూపాల్‌రెడ్డి



ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ నుంచి నియామకం పత్రం అందుకుంటున్న రాంభూపాల్‌రెడ్డి

వేంపల్లె : ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ పరిపాలనాధికారిగా సివిల్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ రాంభూపాల్‌రెడ్డి నియమితులయ్యారు. సోమవారం ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కె.సంధ్యారాణి చేతులమీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా రాంభూపల్‌రెడ్డి మాట్లాడుతూ ట్రిపుల్ ఐటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

ప్రాజెక్ట్ కస్తూరి.. ప్రభుత్వం అమలు చేస్తున్న వినూత్న కార్యక్రమం. బాలికల్లో జీవన నైపుణ్యం పెంచడం ప్రధాన ధ్యేయం. సృజన పెంచడం.. సవాళ్లను అధిగమించడం.. ఇలా పది అంశాల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ఉద్దేశం. ఒక్క మాటలో చెప్పాలంటే అమ్మాయిల్లో పూర్తిస్థాయిలో ఆత్మవిశ్వాసం నింపడమే లక్ష్యం. రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్ట్‌గా వైఎస్‌ఆర్ జిల్లాను ఎంపిక చేశారు. కేజీబీవీల్లో అమలు చేస్తున్నారు. సత్ఫలితాల దిశగా ముందుకెళుతున్నారు.



నైపుణ్య సూత్రం.. కస్తూరి మంత్రం

- బాలికల్లో సృజనాత్మకత పెంపే ధ్యేయంగా 'ప్రాజెక్టు కస్తూరి'
- పైలట్ ప్రాజెక్టు కింద వైఎస్సార్ జిల్లా ఎంపిక

వల్లూరు : బాలికల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం ప్రాజెక్ట్ కస్తూరి కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. విద్యార్థినులు దైనందిన జీవితంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడం.. సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోవడం.. మెరుగైన జీవన నైపుణ్యాలు సొంతం చేసుకునే దిశగా ఈ ప్రాజెక్టు ద్వారా తర్ఫీదు ఇస్తున్నారు.

• ఆఫ్రికా, ఆసియా ఖండాల పరిధిలోని 16 దేశాలతో పాటు భారత దేశంలోని 12 రాష్ట్రాల్లో బాలికా విద్యలో సేవలు అందిస్తున్న రూమ్ టు రీడ్ అనే ఎన్‌జీఓ సంస్థ ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్ట్ కస్తూరి అనే కార్యక్రమాన్ని అమలు చేయడానికి మన ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్ట్ కింద 'ప్రాజెక్ట్ కస్తూరి' కార్యక్రమాన్ని అమలు చేయడానికి వైఎస్‌ఆర్ జిల్లాను ఎంపిక చేశారు. జిల్లా పరిధిలో మొత్తం 17 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలున్నాయి. అందులో 6 కేజీబీవీలను ఈ కార్యక్రమం కింద ఎంపిక చేశారు.

ప్రాజెక్ట్ కస్తూరి అమలయ్యే కేజీబీవీలు

కేజీబీవీ	విద్యార్థినులు
చాపాడు	118
దువ్వూరు	118
మైదుకూరు	117
ఖాజీపేట	104
వల్లూరు	112
పెండ్లిమర్రి	110
మొత్తం	679

• జిల్లాలోని వల్లూరు, చాపాడు, దువ్వూరు, ఖాజీపేట, పెండ్లిమర్రి, మైదుకూరు కేజీబీవీలలో మొదట ఈ కార్యక్రమం అమలుకు శ్రీకారం చుట్టారు. ఈ విద్యాలయాల్లోని 6, 7, 8 తరగతుల బాలికలకు 2022 సెప్టెంబర్ నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఆల్‌రౌండర్లుగా తీర్చిదిద్దడమే ధ్యేయం..

విద్యార్థుల్లోని అంతరాలను తగ్గించి.. లింగ సమానత్వ విద్యా వ్యవస్థను ఆచరణలోకి తీసుకుని రావడం ద్వారా వారిని ఆల్‌రౌండర్లుగా తీర్చిదిద్దాలన్నదే ఈ కార్యక్రమ ప్రధాన ధ్యేయం. ఇందుకు గాను రూమ్ టు రీడ్ సంస్థ ఆధ్వర్యంలోని సుశిక్షితులైన సీనియర్ ఫ్యాకల్టీల ద్వారా శిక్షణ ఇస్తున్నారు. జిల్లాలో ఎంపిక చేసిన కేజీబీవీల్లోని 6, 7, 8 తరగతుల విద్యార్థినులకు నెలకు కనీసం రెండు సెషన్ల ద్వారా శిక్షణ ఇస్తున్నారు.

ఈ అంశాలపై శిక్షణ..

ప్రాజెక్ట్ కస్తూరి ద్వారా.. 10 జీవన నైపుణ్యాలైన ఆత్మ విశ్వాసం, భావోద్వేగాలను వ్యక్త పరచడం, నియంత్రణ సాధించడం, సహానుభూతి, స్వీయ నియంత్రిత నైపుణ్యాలు, విమర్శనాత్మక ఆలోచనా నైపుణ్యాలు, నిర్ణయం తీసుకోవడం, పట్టుదల, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు, సృజనాత్మక సమస్యా పరిష్కార నైపుణ్యాలు, సంబంధాలు ఏర్పరచుకొనే నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం దృఢ సంకల్పంతో ముందుకు సాగేలా తీర్చిదిద్దుతారు.

డ్రామాలు, రోల్‌ప్లే, గ్రూప్ యాక్టివిటీలు, బృంద చర్చలు మొదలైన పద్ధతుల ద్వారా బాలికలకు స్వీయ అవగాహన, దృఢమైన భావ వ్యక్తీకరణ, రుతు క్రమంతో బాటు ఇతర ఆరోగ్య విషయాలపై అవగాహన పెంపొందించుకోవడం, హక్కులు , బాధ్యతలు వంటి అంశాలను చార్టులు, ఇతర మెటీరియల్ ద్వారా సులభంగా అర్థమయ్యేలా వివరిస్తున్నారు.

వచ్చే ఏడాది మిగిలిన కేజీబీవీల్లో అమలు..

వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రస్తుతం అమలవుతున్న ఆరింటితోపాటు మిగిలిన 11 కేజీబీవీల్లో కార్యక్రమాన్ని అమలు చేస్తారు. ఇందుకుగాను ఒక్కో కేజీబీవీ నుంచి ముగ్గురు ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి వారిద్వారా విద్యార్థినులకు అవగాహన కల్పిస్తారు. ఇందుకు అవసరమైన మెటీరియల్‌ను సమకూరుస్తారు.

సమస్యలను ఎదుర్కొనే సామర్థ్యం



బాలికలు జీవన నైపుణ్యాల పట్ల సరైన అవగాహన కలిగి ఉండడం వలన జీవితంలో ఎదురయ్యే సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనే సామర్థ్యాన్ని పొందుతారు. సమాజంలో పరిస్థితులకు అనుగుణంగా నడుచుకోవడానికి జీవన నైపుణ్యాలు దోహదం చేస్తాయి.
– హరిత, సీనియర్ ఫ్యాకల్టీ, రూమ్ టు రీడ్

అందరి సహకారంతో విజయవంతం



సమగ్ర శిక్ష అధికారులతో పాటు విద్యా శాఖ అధికారులు, రూమ్ టు రీడ్ ప్రతినిధుల సహకారంతో ప్రాజెక్ట్ కస్తూరి విజయవంతంగా అమలవుతోంది. విద్యార్థినుల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించడంలో ఎంతో ఉపయోగకరంగా ఉంది.
– నజీమున్నీసా, ప్రిన్సిపల్, వల్లూరు కేజీబీవీ

ఎంతో ఉపయోగకరం



ప్రాజెక్ట్ కస్తూరి కార్యక్రమం మాకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఎలా ఎదుర్కోవాలో నేర్చుకున్నాం. శిక్షణ బాగా ఇస్తున్నారు. ఆత్మవిశ్వాసం పెరుగుతోంది. ఇది మాకు దక్కిన చక్కని అవకాశం.
– మనస్విని, 8వ తరగతి, కేజీబీవీ వల్లూరు

వచ్చే ఏడాది 17 కేజీబీవీల్లో అమలు



బాలికల్లో నైపుణ్యం పెంపే ధ్యేయంగా సమగ్ర శిక్ష ప్రాజెక్ట్, విద్యాశాఖ ఆధ్వర్యంలో 'ప్రాజెక్ట్ కస్తూరి' కేజీబీవీల్లో అమలు చేస్తున్నాం.వచ్చే ఏడాది నుంచి జిల్లా లోని 17 కేజీబీవీల్లో ఒక్కో కేజీబీవీ నుంచి ముగ్గురు ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి వారి ద్వారా కార్యక్రమాన్ని అమలు చేస్తాం.
– సదాశివరెడ్డి, రూమ్‌టు రీడ్ స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్

---

15 నుంచి వైవీయూ పరిధిలో న్యాయ పరీక్షలు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం (వైవీయూ) పరిధిలోని న్యాయకళాశాలల్లో మూడు, ఐదు సంవత్సరాల న్యాయశాస్త్ర విద్య (లా) సెమిస్టర్ పరీక్షలు ఈనెల 15 నుంచి ప్రారంభం కానున్నట్లు వైవీయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. మూడేళ్ల లా కోర్సు చదువుతున్న 3,5 సెమిస్టర్ల విద్యార్థులకు, ఐదేళ్ల లా కోర్సు 3,5,7,9 సెమిస్టర్ల వారికి పరీక్షలు ఉంటాయన్నారు. ఉదయం 9 నుంచి 12 గంటలకు పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. పరీక్షల టైంటేబుల్, ఆయా కళాశాలల్లో, వైవీయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

12న క్రికెట్ ఎంపికలు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ నెట్స్‌లో ఈనెల 12వ తేదీ బుధవారం జిల్లాస్థాయి అండర్-19, సీనియర్ విభాగం క్రికెట్ ఎంపికలు జరగనున్నాయి. ఈ విషయాన్ని క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్‌ఆర్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్, ఆపరేషన్స్ డైరెక్టర్ ఎస్. ఖాజామైనుద్దీన్ తెలిపారు. బుధవారం ఉదయం 7.30 గంటలకు ఎంపికలు జరుగుతాయన్నారు. అండర్-19 ఎంపికలకు హాజరయ్యే వారు 2004 సెప్టెంబర్ 1 తర్వాత పుట్టినవారై ఉండాలన్నారు.

కిసాన్ డ్రోన్ పైలట్‌తో ఉపాధి



వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు

కడప అగ్రికల్చర్ : గ్రామంలోని నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు కిసాన్ డ్రోన్ పైలట్ మంచి అవకాశమని జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు పేర్కొన్నారు.సోమవారం ఆయన మాట్లాడుతూ గ్రామంలో నివసిస్తూ రైతు కుటుంబానికి చెందిన అగ్రికల్చర్ డిగ్రీ, అగ్రికల్చర్ డిప్లొమా, అగ్రికల్చర్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్ డిప్లొమా చేసిన వారు కిసాన్ డ్రోన్ పైలెట్ శిక్షణకు అర్హులని తెలిపారు. అర్హత కలిగిన వారు పూర్తి వివరాలకు మండల వ్యవసాయాధికారులను కలవాలని నాగేశ్వరావు తెలిపారు.

'స్పందన' అర్జీలను వెంటనే పరిష్కరించాలి



అర్జీలను పరిశీలిస్తున్న డీఆర్వో గంగాధర్‌గౌడ్

కడప సిటీ : స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు వేగవంతంగా పరిష్కారం చూపాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) గంగాధర్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి డీఆర్వోతోపాటు డ్వామా పీడీ యదుభూషణరెడ్డి, జీఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రవిశంకర్‌రెడ్డి, అడా వైస్ చైర్మన్ శ్రీలక్ష్మి హాజరై ప్రజల నుంచి ఫిర్యాదు స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ అర్జీదారులను ఆప్యాయంగా పలుకరించాలన్నారు. సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సీపీఓ వెంకట్రావు, జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి హౌసింగ్ పీడీ కృష్ణయ్య, ఎల్‌డీఎం దుర్గాప్రసాద్, మెప్మా పీడీ రామ్మోహన్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ మహేశ్వర్‌రెడ్డి, పీఆర్ ఎస్ఈ శ్రీనివాసులురెడ్డి, వ్యవసాయశాఖ జేడీ నాగేశ్వరరావు, సమగ్రశిక్ష ఏపీసీ ప్రభాకర్‌రెడ్డి, డీఈఓ రాఘవరెడ్డి, ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి ఇతర అధికారులు పాల్గొన్నారు.

అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలి

ఏప్రిల్, మే నెలల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఆర్వో గంగాధర్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ విజయరామరాజు ఆదేశాల మేరకు జిల్లాలో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ ఏడాది గతంలో కంటే 2–3 డిగ్రీల ఉష్ణోగ్రతలు అధికంగా అంటే 40–44 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ సూచించిందన్నారు. ఇందుకు సంబంధించి జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఇతర శాఖల అధికారులకు ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలను ప్రజలకు ప్రాంతీయ ప్రసార మాధ్యమాల ద్వారా తెలియజేయాలని సూచించారు. స్వచ్ఛంద సంస్థలను సమన్వయం చేసుకుని చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు తాగునీరు ఏర్పాటుతోపాటు పదో తరగతి పరీక్షా సమయంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలు ఉదయం పూట త్వరగా పనులకు వచ్చి 11 గంటలకల్లా పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు.

ఒక్క దెబ్బకు రెండు పిట్టలు!

- పోట్లదుర్తి నాయుడు ఎత్తుగడలను పసిగట్టిన మాజీ ఎమ్మెల్యే వరద
- అదును చూసి తెరపైకి వచ్చిన వైనం



సాక్షి ప్రతినిధి, కడప : గురి చూసి కొట్టాడురా... ఒక్క దెబ్బకు రెండు పిట్టలు పడ్డాయంటూ గ్రామీణుల్లో ఉన్న సామెతను అక్షరాల మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి నిజం చేస్తున్నారు. ప్రొద్దుటూరు టీడీపీ టికెట్‌కు ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సీఎం సురేష్‌నాయుడు ఆశలు పెట్టుకున్నారు. ఆమేరకు ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. కాగా ఆ ఇద్దరికి ఏకకాలంలో మాజీ ఎమ్మెల్యే వరద చెక్ పెట్టారని రాజకీయ విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. రాజకీయ సమీకరణ నేపథ్యంలో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్న పోట్లదుర్తి నాయుడు కుటుంబానికి అంతే వ్యూహాత్మకంగా ఎదురు నిలిచారు.

రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మధ్య రాజకీయ వైరం ఉంది. ఈనేపథ్యంలో పోట్లదుర్తి నాయుడు కుటుంబ బలం గ్రామానికి ఎక్కువ మండలానికి తక్కువ.. అలాంటోళ్లకు రాజ్యసభ స్థానం కేటాయించారని మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి బహిరంగంగా విమర్శించారు. విమర్శకు ప్రతివిమర్శ చేస్తూ ఇరుపక్షాల మధ్య రాజకీయ వైరం కొనసాగింది. అందులో భాగంగా 2019లో వరదరాజులరెడ్డి అభ్యర్థిత్వాన్ని సీఎం రమేష్ తీవ్రంగా వ్యతిరేకించారు. వెరసి మల్లెల లింగారెడ్డికి టీడీపీ టికెట్ ఖరారు చేశారు. ఆ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి చేతిలో లింగారెడ్డి ఘోర పరాజయం పాలయ్యారు. అప్పటి నుంచి స్తబ్దుగా ఉన్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఒక్కమారుగా ప్రత్యక్ష రాజకీయాల వైపు మొగ్గు చూపారు.

నాయుడు ఎత్తుగడల నేపథ్యంలో...

ప్రొద్దుటూరు టీడీపీ టికెట్‌పై ఆశలు పెట్టుకున్న ఎంపీ సీఎం రమేష్ సోదరుడు సీఎం సురేష్ రాజకీయ సమీకరణలకు తెరలేపారు. అందులో భాగంగా వారి తండ్రి సీఎం మునిస్వామినాయుడు దంపతులు వెయ్యి పౌర్ణమిలను చూశారనే సాకుతో ఓ కార్యక్రమాన్ని పోట్లదుర్తిలో చేపట్టారు. సహస్ర చంద్రదర్శన మహోత్సవం పేరిట రాజకీయ సమీకరణలకు తెరలేపారు. నాయుడు కుటుంబం ఎత్తుగడలను పసిగట్టిన మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఒక్కమారుగా ప్రత్యక్షమయ్యారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా బరిలో ఉంటానని ప్రస్తుత ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డితో కలిసి పనిచేస్తానని ప్రకటించారు. ఈప్రకటన వెనుక నాయుడు కుటుంబానికి కూడా చెక్ పెట్టినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

రాచమల్లుతో తలపడాలంటే....

ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డితో ఎన్నికల్లో ప్రత్యక్షంగా తలపడాలంటే ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి లేదా సీఎం సురేష్‌నాయుడుతో అయ్యే పని కాదని పరిశీలకుల అంచనా. తర తమ బేధం లేకుండా ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యేగా నిత్యం అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్న రాచమల్లుకు అనేక ప్లస్ పాయింట్లు ఉన్నాయి. ఆయన్ను ఢీకొట్టాలంటే అషామాషీగా ఉండే అవకాశం లేదు. ఈపరిస్థితుల్లో బలమైన అభ్యర్థి కోసం టీడీపీ అన్వేషించే అవకాశం లేకపోలేదు. స్తబ్దుగా ఉంటే ఆ ఇరువురిలో ఒక్కరు టీడీపీ అభ్యర్థి అయ్యే అవకాశం కన్పిస్తోంది. రాజకీయ కుయుక్తులతో ప్రొద్దుటూరులో పోట్లదుర్తి కుటుంబం టీడీపీలో పాగా వేసే ఛాన్స్ బలంగా ఉంది. ఈ పరిస్థితికి చెక్ పెట్టాలనే దిశగా వరదరాజులరెడ్డి తెరపైకి వచ్చినట్లు కూడా పలువురు చెప్పుకోవడం విశేషం. ఆర్థికంగా మినహాయిస్తే, వర్గ పరంగా ఆ ఇద్దరి కంటే వరదరాజులరెడ్డికే అధిక బలం ఉంటుందనే పరిశీలకులు భావిస్తున్నారు. ఈపరిస్థితుల్లో టీడీపీ అధినేత చంద్రబాబు ఆలోచన దృష్టి వరదపై పడే అవకాశం ఉంటుందనే భావనతో అనూహ్యంగా తెరపైకి వచ్చినట్లు విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

సమన్వయంతో అభివృద్ధికి పాటుపడాలి

- మేయర్ సురేష్ బాబు, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా
- వాడి, వేడిగా నగరపాలక సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న మేయర్ సురేష్ బాబు, చిత్రంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్లు

కడప కార్పొరేషన్ : ప్రణాళికాబద్ధంగా చిత్తశుద్ధి, సమన్వయంతో పనిచేసి కడప నగరాభివృద్ధికి పాటుపడాలని మేయర్ సురేష్ బాబు, ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అధికారులు, ప్రజా ప్రతినిధులను ఆదేశించారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో మేయర్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మొదట అజెండాపై చర్చిస్తుండగా 47వ డివిజన్ కార్పొరేటర్ పాకా సురేష్ కుమార్ జోక్యం చేసుకుంటూ గత బడ్జెట్‌లో మురికివాడల అభివృద్ధికి, ఎస్సీ, ఎస్టీలకు, వికలాంగులకు, మహిళలకు 40 శాతానికి పైగా నిధులు వెచ్చించినట్లు చెప్పారని, ఆ వివరాలు తెలపాలని పట్టుబట్టారు. దీనిపై ఎస్ఈ రత్నాల రాజు స్పందిస్తూ వారంలోగా అందజేస్తామని తెలపగా, పదిహేను రోజులుగా ఏం చేస్తున్నారని నిలదీశారు. మేయర్ సురేష్ బాబు మాట్లాడుతూ సభ్యులు అడిగిన సమాచారం ఇవ్వాలికదా... పద్ధతి బాగా లేదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు.

• కార్పొరేటర్లు ఏవైనా బ్యానర్లు, ఫ్లెక్సీలు వేస్తే రెండు, మూడు రోజులకే చించి వేస్తున్నారని, ఇతరులవి మాత్రం వారాల తరబడి ఉన్నా తొలగించడం లేదని పాకా సురేష్ ఆరోపించారు. దీనిపై 30వ డివిజన్ కార్పొరేటర్ షఫీ స్పందిస్తూ ఫ్లెక్సీలు రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేయకుండా చూడాలని, వాటి వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. దీనిపై మేయర్ స్పందిస్తూ అందరికీ ఒకే విధమైన నిబంధన అమలు చేయాలని, సభ్యులు ఏదైనా చెబితే తగిన విధంగా స్పందించాలని కమిషనర్‌కు సూచించారు. గోడలపై వాల్ పెయింటింగ్ చేసే వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.

• కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ.2.73కోట్లకు చెత్తబుట్టలు కొన్నారని, వీటిని టెండర్ ద్వారా కొన్నారా, నామినేషన్‌పై కొన్నారా సమాధానం చెప్పాలని పాకా సురేష్ ప్రశ్నించారు. 14 శాతం లెస్‌తో టెండర్ పిలిచామని ఎస్ఈ చెప్పగా, తామే కొన్నట్లు స్వచ్ఛ ఆంధ్ర వారు తనకు ఆర్‌టీఐ ద్వారా సమాచారమిచ్చారని పాకా సురేష్ చెబుతూ ఏది నిజమో చెప్పాలని మళ్లీ ప్రశ్నించారు. దీనిపై ఏఈ అంజలి కుమార్ సమాధానం ఇచ్చేందుకు ప్రయత్నించగా, 38వ డివిజన్ కార్పొరేటర్ మగ్బూల్ బాషా అభ్యంతరం తెలిపారు. సభా మర్యాద పాటించాలని, సెక్షన్ హెడ్‌లు కాకుండా కిందిస్థాయి అధికారులు ఎలా సమాధానం చెబుతారని ప్రశ్నించారు. దీంతో సభలో గందరగోళం చెలరేగింది. కార్పొరేటర్ కె. సూర్య నారాయణ రావు అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ సభ్యుల ప్రశ్నలకు సమాధానం చెప్పలేని స్థితిలో ఉండటం ఏమిటని నిలదీశారు. ఒక అంశాన్ని సాగదీయకుండా మిగిలిన అంశాలపై చర్చించాలని కార్పొరేటర్ మల్లికార్జున సూచించారు.

• సర్వేనంబర్ 72/1బి మాస్టర్ ప్లాన్ ఎఫ్‌ఎంబీ ప్రకారం ఎక్కడెక్కడ ఆక్రమణలున్నాయో తెలియజేసి, ఆ భవనాలను తొలగించాలని 21వ డివిజన్ కార్పొరేటర్ ఎం. సుజాత కోరారు.

• అంతకుముందు కౌన్సిల్ సమావేశంలో అజెండాలో పొందుపరిచిన 12 అంశాల్లో ప్రధానంగా 15వ ఆర్థిక సంఘం నిధుల కేటాయింపు, వివిధ పనులకు కేటాయించిన నిధులు, ఖర్చు చేసిన వివరాలతోపాటు, నగరంలో బీటీ, సీసీ రోడ్ల అభివృద్ధి, సుందరీకరణ పనులకు చేసిన ఖర్చు వివరాలపై చర్చించారు. డిప్యూటీ మేయర్లు ముంతాజ్ బేగం, నిత్యానందరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్ చంద్, డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, కార్పొరేటర్లు సానపురెడ్డి శివకోటి రెడ్డి, సుబ్బారెడ్డి, జయమ్మ, అరీఫుల్లా బాషా, గంగాదేవి, కె. అరుణప్రభ, శ్రీలేఖ, కో ఆప్షన్‌సభ్యులు ఎస్ ఎండీ జహీర్, మరియ, పత్తిరాజేశ్వరి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్త వహించాలి : మేయర్

అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే ఏ కార్యక్రమమైనా విజయవంతమవుతుందని మేయర్ సురేష్‌బాబు అన్నారు. నగరంలో విలీనమైన పంచాయితీలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేయాలన్నారు. సచివాలయ సిబ్బందిని నగరపాలక అభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలన్నారు. ఏప్రిల్, మే మాసాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా, చివర ఉన్నవారికి కూడా నీరందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

కార్పొరేటర్ల భాగస్వామ్యం ఉండాలి : డిప్యూటీ సీఎం

కడప నగరపాలక సంస్థ చేపట్టే ప్రతి కార్యక్రమంలోనూ కార్పొరేటర్ల భాగస్వామ్యం ఉండేలా చూసుకోవాలని డిప్యూటీ సీఎం అంజద్ బాషా అన్నారు. పారిశుధ్యం, స్వచ్ఛతకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి కడపను ఆరోగ్య నగరంగా తయారు చేస్తున్నామన్నారు. కడప నగరానికి తలమానికంగా పలు ప్రధాన రహదారుల్లో విస్తరణ పనులు చేపట్టడం జరుగుతోందన్నారు. అన్ని పనులు పూర్తయితే ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవన్నారు. కార్పొరేటర్ల సహకారం వల్లే విస్తరణ పనులు చేపడుతున్నారని చెప్పారు.

దుకాణాల ఏర్పాటుకు టెండర్లు

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని టీటీడీ శ్రీ నారాపుర వెంకటేశ్వరస్వామి బ్రహోత్సవాలు మే 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఆలయ ఆవరణలో దుకాణాలు, జాయింట్ వీల్స్ ఏర్పాటుకు టీటీడీ అధికారులు టెండర్లు నిర్వహించారు. ఇందులో ఆరుగురు పాల్గొని టెండర్లు దాఖలు చేశారు. అత్యధికంగా రామిరెడ్డి రూ.5 లక్షల 905కు వేసిన టెండర్‌ను అధికారులు ఆమోదించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈఓ నటేష్ బాబు, ఏఈ కళావతి, ఏఈఓ గోపాల్, సూపరింటెండెంట్ వెంకటేశ్వరయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్నపై తమ్ముడి దాడి

వల్లూరు : మండల పరిధిలోని గోటూరుకు చెందిన పల్లావుల పెద్ద సుబ్బరాయుడు అనే వ్యక్తి పై అతడి తమ్ముడు పల్లావుల లక్ష్మయ్య, తమ్ము ని కుమారుడు లక్ష్మణరావు దాడి చేసి గాయపరిచినట్లు ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నా యి. అన్నదమ్ములైన పెద్ద సుబ్బరాయుడు, లక్ష్మయ్యకు భూ తగాదాలున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం పెద్ద సుబ్బరాయుడు గోటూరు గ్రామ శివారులో వాకింగ్‌కు వెళ్లగా.. అక్కడ లక్ష్మయ్య, అతని కుమారుడు లక్ష్మణరావు కలసి దాడి చేసి గాయపరిచారు. అక్క డ ఉన్న ప్రజలు గట్టిగా కేకలు వేయడంతో తండ్రి కొడుకులిద్దరూ పరారయ్యారు. బాధితుడిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కడపకు తరలించారు. పెద్ద సుబ్బరాయుడు మేనల్లుడు సాంబయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిళ్లు దగ్ధం



రాజంపేట రూరల్ : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సోమవారం రెండు పూరిళ్లు దగ్ధం అయ్యాయి. రోజు వారి కూలి పనులు చేసుకొని జీవించే రెండు కుటుంబాలు నిరాశ్రయులుగా వీధిన పడ్డాయి. మండల పరిధి కొల్లావారిపల్లి పంచాయతీలోని దళితవాడలో గార్లపాటి సుశీల పూరిల్లులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. సమీపంలోని పిల్లిపోగు రాజమ్మ ఇంటికి వ్యాపించాయి. ఈ సంఘటనలో రెండిళ్లు కాలిపోయాయి. సుశీల కుటుంబంలో సుశీలతోపాటు తన భర్త, ఇద్దరు పిల్లలు, రాజమ్మ కుటుంబంలో రాజమ్మతోపాటు తన భర్త, నలుగురు పిల్లలు ఉన్నారు. మంటలు చెలరేగడంతో ఏ వస్తువు వెలుపలికి తెచ్చుకొనే అవకాశం లేకపోవడంతో మొత్తం సామగ్రి అగ్నికి ఆహుతి అయింది. జెడ్పీటీసీ దాసరి ప్రశాంతి భర్త వైఎస్సార్‌సీపీ దళిత నాయకుడు దాసరి పెంచలయ్య విషయాన్ని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డికి తెలిపారు. ఆకేపాటి ఆదేశాల మేరకు తహసీల్దార్ ముద్దా సుబ్రమణ్యంరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బొల్లినేని రామ్మోహన్‌నాయుడు, దాసరి పెంచలయ్య, సచివాలయ కన్వీనర్ కత్తి నరిసంహా తదితరులు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి దాదాపు ఒక లక్షా 50 వేల రూపాయలకు పైగా నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. ప్రభుత్వం తరఫున ఆదుకోవాలని వారు కోరారు.

వందేళ్ల.. సబ్‌కలెక్టరేట్

- శతాబ్ది ఉత్సవాలకు నోచుకునేనా..!
- బ్రిటిష్ కాలం నుంచి ఐఏఎస్‌ల రాజ్యం
- జిల్లా కేంద్రంతో సమానంగా..
- వైఎస్సార్‌సీపీ హయాంలో మళ్లీ ఐఏఎస్‌ల పాలన

సబ్‌కలెక్టరేట్	రాజంపేట
కేంద్రం	పార్లమెంటు నియోజకవర్గం
ప్రారంభం	1915
ఐఏఎస్‌లు	23 మంది



రాజంపేట సబ్ కలెక్టరేట్ ముఖద్వారం

రాజంపేట : వైఎస్సార్ జిల్లాలో ఉన్నప్పుడు కలెక్టరేట్ తర్వాత సబ్‌కలెక్టరేట్ స్థానం రాజంపేటది. ఇప్పుడు అన్నమయ్య జిల్లా ఏర్పడిన తర్వాత జిల్లా కేంద్రంతో సమానంగా ఐఏఎస్‌ల పాలన రాజంపేట రెవెన్యూ డివిజన్‌లో కొనసాగుతోంది. 1915లో 13 ఎకరాలకు పైగా విస్తీర్ణం కలిగిన స్థలంలో సబ్ కలెక్టరేట్ ఏర్పాటు అయింది. రాజంపేట, రైల్వేకోడూరు ఉమ్మడి నియోజకవర్గానికి సబ్‌కలెక్టరేట్ ప్రజాస్వామ్యపరంగా ప్రత్యేక భూమిక పోషించింది. ఇప్పుడు ఈ సబ్‌కలెక్టరేట్ వందేళ్లు పూర్తి చేసుకుంది. తెల్లదొరలపాలన నుంచి రెవెన్యూ సేవలందించిన రాజంపేట సబ్‌కలెక్టరేట్ ఒక చారిత్రాత్మక కట్టడంగా మిగిలిపోయింది.

బ్రిటిష్ కాలం నుంచి..

బ్రిటిష్ కాలం నుంచి డివిజన్‌కు చరిత్ర ఉంది. ఎందరో ఐఏఎస్‌లు ఇక్కడ సబ్‌కలెక్టరుగా పని చేశారు. సీనియర్ ఐఏఎస్‌లు ఎంఎస్ రాజాజీ, సతీనాయర్, డి.ఆరోరా, సి.రామచంద్రమూర్తి, టీఎస్ రంగాచారి, వల్లియప్పన్, ఎంఆర్‌సాయ్, మిన్నిమాథ్యూస్, జానకికృష్ణమూర్తి, ఏకే గోయల్, సతీసుజామున్, రణబీర్‌సుధన్, అజయ్‌జైన్ లాంటి వారు రాజంపేట సబ్‌కలెక్టరుగా పని చేసి రెవెన్యూశాఖ పేరు ఇనుమడింప చేశారు. ల్యాండ్ రెవెన్యూ కమిషనరుగా పని చేసిన పునీత ఇక్కడ సబ్‌కలెక్టరుగా పని చేశారు. ప్రిన్సిపల్ సెక్రటరీగా మిన్నీమాథ్యూస్ పని చేశారు. ప్రీతీమీనా సబ్‌కలెక్టర్‌గా పని చేశారు.

సభభావనం చరిత్ర ఇలా..

1977లో దళిత, గిరిజన డెవలప్‌మెంట్ కో–ఆపరేటివ్ ప్రైమరీ సొసైటీ లిమిటెడ్ కార్యాలయం ఉండేది. ఈ కార్యాలయాన్ని ఐఏఎస్ అధికారి కుమారి జానకి కృష్ణమూర్తి సబ్‌కలెక్టరుగా ఉన్నప్పుడు ప్రారంభించారు. 20 ఏళ్ల తర్వాత రెవెన్యూ డివిజన్‌కు మీటింగ్ హాల్‌గా మార్చివేశారు. 1998 ఏప్రిల్ 30న అప్పటి జిల్లా కలెక్టరు నాగిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. అప్పటి నుంచి ఆర్డీవో సభాభవనం అందుబాటులోకి వచ్చింది. 17 ఏళ్లు పూర్తి కావస్తోంది.

డివిజన్ స్వరూపం ఇలా..

రాజంపేట సబ్‌కలెక్టరేట్				
నియోజకవర్గం	మండలాలు	గ్రామాలు	విస్తీర్ణం (చ.కి.మీ)	జనాభా
రాజంపేట	6	103	1784	3,06,995
రైల్వేకోడూరు	5	101	1360	2,67,987

రాజంపేట సబ్ కలెక్టరేట్‌గా చరిత్ర కలిగిన రాజంపేట సబ్‌కలెక్టరేట్ జిల్లాలో సగంభాగం రెవెన్యూ పాలన ఇక్కడి నుంచే జరిగేది. డివిజన్లు ఏర్పాటు తర్వాత రాయచోటి కడప డివిజన్‌కు, జమ్మలమడుగులో ఉన్న బద్వేలు రాజంపేట డివిజన్ పరిధిలోకి తీసుకొచ్చారు. పరిధిలో డివిజన్‌గా రూపాంతరం చెందిన తర్వాత 17 మండలాలుగా విస్తరించబడింది. సబ్‌కలెక్టరేట్‌లో ఐఏఎస్‌లు సబ్ కలెక్టరుగా పిలవబడుతూ వచ్చారు. డివిజన్ల అయిన తర్వాత ఆర్డీవోలుగా కొంత మంది పని చేశారు. పచ్చని చెట్ల మధ్య ఆహ్లాదకరమైన వాతవరణంలో రాజంపేట సబ్‌కలెక్టరేట్ కనిపిస్తోంది. అలాగే ఆర్డీఓ క్యాంప్ ఆఫీసు, క్వార్టర్స్‌తోపాటు రెవెన్యూ హోం, జడ్జి క్వార్టర్స్, సభాభవనం లాంటి భవనాలు ఉన్నాయి.

వైఎస్సార్‌సీపీలో మళ్లీ ఐఏఎస్‌ల పాలన

వైఎస్సార్‌సీపీ పాలనలో మళ్లీ ఐఏఎస్‌ల పాలనకు శ్రీకారం చుట్టారు. కేతన్‌గార్గ్ సబ్‌కలెక్టర్‌గా పని చేశారు. ఆయన అనంతపురం జేసీగా బదిలీ అయ్యారు. ప్రస్తుతం సబ్‌కలెక్టర్‌గా ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పని చేస్తున్నారు. .2012–2014 వరకు ఐఏఎస్ హోదాలో రాజంపేట సబ్‌కలెక్టరుగా ప్రీతిమీనా రెవెన్యూ సేవలను డివిజన్‌లో కొనసాగించారు.

శతాబ్ది ఉత్సవాల కోసం ఎదురుచూపు

వందేళ్లు పూర్తి అయి రెండేళ్లు అవుతున్న భావితరాలకు రాజంపేట సబ్‌కలెక్టరేట్ చరిత్రను చాటి చెప్పే విధంగా చేయాల్సిన శతాబ్ది ఉత్సవాలకు ఇప్పుడైనా నోచుకుంటుందా అని రాజంపేట వాసులు ఎదురు చూస్తున్నారు. ఆ దిశగా జిల్లా రెవెన్యూ శాఖ దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. రాజంపేట సబ్‌కలెక్టరేట్ చరిత్రను ఎలుగెత్తి చాటి చెప్పేలా శతాబ్ది ఉత్సవాలను నిర్వహించేందుకు రెవెన్యూ అసోసియేషన్‌తోపాటు రెవెన్యూ పెద్దలు ముందుకు రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు. కాగా ఆర్డీవోగా వీరబ్రహ్మం పని చేసిన క్రమంలో సబ్‌కలెక్టరేట్‌లో లభించిన 1915 నాటి శిలాఫలకం జీర్ణోద్ధరణ చేసిన సంగతి తెలిసిందే.

తలమానికం



ఉభయవైఎస్సార్ జిల్లాలో రెవెన్యూ వ్యవస్థకే రాజంపేట సబ్‌కలెక్టరేట్ తలమానికం. బ్రిటిషుకాలం నుంచి రెవెన్యూ వ్యవస్థకే పెద్ద చారిత్రాత్మక కలెక్టరేట్‌గా భావిస్తున్నాను. నాటి రెవెన్యూ పాలనను అద్దం పట్టే కేంద్రంగా రాజంపేట సబ్‌కలెక్టరేట్ విరాజిల్లింది. భావితరాలకు చాటి చెప్పేలా శతాబ్ది ఉత్సవాలను నిర్వహించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

–పి.నరసింహకుమార్, అధ్యక్షుడు, రెవెన్యూ అసోసియేషన్, అన్నమయ్య జిల్లా

తెల్లదొరల కాలం నుంచే..



తెల్లదొరల పాలన నాటి రెవెన్యూ వ్యవస్థ ఈ సబ్ కలెక్టరేట్‌లో కొనసాగింది. రాజంపేట సబ్‌కలెక్టరేట్‌కు ఎంతో ఘనమైన చరిత్ర ఉంది. వందేళ్ల పూర్తి చేసుకుంది. భావితరాలకు రాజంపేట సబ్‌కలెక్టరేట్ చరిత్రాత్మకను తెలియజేయాల్సి ఆవశ్యకత ఎంతైనా ఉంది. శతాబ్ది ఉత్సవాల నిర్వహణపై రెవెన్యూ పెద్దల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తాం.

–జి.శ్రీధర్‌రావు, అధ్యక్షుడు, రాజంపేట డివిజన్, రెవెన్యూ అసోసియేషన్

వైఎస్సార్‌సీపీ నాయకుడి హత్య కేసులో 8 మంది అరెస్ట్


మీడియా సమావేశంలో హత్య కేసు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ బీవీ శివారెడ్డి

కమలాపురం : కమలాపురం పట్టణం తెలుగు వీధికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కె. జయ శంకర్‌రెడ్డి హత్య కేసులో 8 మందిని అరెస్ట్ చేసినట్లు కడప డీఎస్పీ బీవీ శివారెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన హత్య కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. శంకర్ రెడ్డి కుమారుడు పవన్ కల్యాణ్‌రెడ్డి, గిడ్డంగివీధికి చెందిన పల్లె శేఖర్ రెడ్డి కుమార్తెను ఇటీవల ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈ వివాహం శేఖర్‌రెడ్డి సోదరుడైన టీడీపీ నాయకుడు పల్లె రామసుబ్బారెడ్డి కుటుంబ సభ్యులకు రుచించలేదు. శంకర్‌రెడ్డి ఉద్దేశపూర్వకంగానే తన కుమారుడిని ప్రోత్సహించడంతో పాటు తమను అవమాన పరిచాడని భావించిన పల్లె రామసుబ్బారెడ్డి, పల్లె శేఖర్ రెడ్డి కసి పెంచుకున్నారు. శంకర్ రెడ్డిని హత్య చేయాలని పథకం వేశారు. ఈ నేపథ్యంలో 7వ తేదీ మధ్యాహ్నం మూలగడ్డ సమీపంలోని తన పొలంలో సాగు చేసిన కొర్రపంటకు నీరు పారగట్టడానికి కొడుకుతో పాటు వెళ్లిన శంకర్ రెడ్డిపై నిందితులు కాపు కాచి ఇనుపరాడ్లతో దాడి చేసి హత్య చేశారు. మృతుడి రెండో కుమారుడు నవీన్ కల్యాణ్ రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో పల్లె రామసుబ్బారెడ్డి, పల్లె శేఖర్ రెడ్డి, పల్లె రవీంద్రారెడ్డి (నరేంద్రారెడ్డి), కరెడ్ల మహేష్, పల్లె వెంకట సుబ్బారెడ్డి, పుత్తా శ్రీనివాసులరెడ్డి, మండ్ల శ్రీనివాసులు, యాకాసి వెంకట రమణల ప్రమేయం హత్యలో ఉన్నట్లు విచారణలో తెలిసిందన్నారు. వీరంతా సోమవారం సంబటూరు సమీపంలో ఉండగా అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన 6 ఇనుప రాడ్లు, రెండు బైక్స్, 6 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఈ హత్య కేసులో ఇతరుల పాత్ర ఏమైనా ఉందా అని తేల్చడం కోసం లోతైన దర్యాప్తు చేపడుతున్నట్లు బీవీ శివారెడ్డి తెలిపారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరుస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సీఐ సత్యబాబు, ఎస్ఐ చిన్నపెద్దయ్య పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లు మంజూరు చేయించండి


నాగార్జునరెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

రాజంపేట టౌన్ : నియోజకవర్గంలోని ప్రజలు, రైతులకు మరింత మెరుగైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు మరికొన్ని సబ్‌స్టేషన్‌లు మంజూరు చేయించాలని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి.. ఏపీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్, హైకోర్టు మాజీ న్యాయమూర్తి సీవీ నాగార్జునరెడ్డిని కోరారు. ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన సోమవారం రాజంపేటకు వచ్చిన సందర్భంగా ప్రభుత్వ న్యాయవాది వంకన గురుప్రతాప్‌కుమార్‌రెడ్డి తన స్వగృహంలో ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాగార్జునరెడ్డిని ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ సత్కరించారు. ఆయన వారితో నియోజకవర్గంలోని అభివృద్ధిపై చర్చించారు. గ్రామీణ ప్రాంతాల్లో లోటల్టేజీ సమస్యను అధిగమించేందుకు అదనంగా ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆకేపాటి మురళీరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, తహసీల్దార్ సుబ్రమణ్యం రెడ్డి, ఏపీఎస్‌పీడీసీఎల్ ఓఎస్‌డీ శ్రీనివాసులు, ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, డీఈఈ సురేంద్రనాథ్, సర్పంచ్‌ల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు భూమన శివశంకర్ రెడ్డి, వివిధ పంచాయతీలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రాజంపేట, నందలూరు, రైల్వేకోడూరు బార్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్య

మదనపల్లె : అప్పుల బాధతో మనస్తాపం చెందిన ఓ చేనేత కార్మికుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఆదివారం రాత్రి మదనపల్లె పట్టణంలో జరిగింది. మొలకలచెరువు మండలం బురకాయలకోట పంచాయతీ బలకవారిపల్లెకు చెందిన బి.ఎస్.ఆనందరెడ్డి (35) కొంత కాలం క్రితం పట్టణంలోని అయోధ్యనగర్‌కు వచ్చి స్థిరపడ్డాడు. చేనేత కార్మికునిగా పని చేస్తూ జీవిస్తున్నాడు. ఇతనికి భార్య సుభాషిణి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ క్రమంలో ఆనందరెడ్డితోపాటు భార్య సుభాషిణి కూడా చేనేత పనులు చేస్తుండేది. కొద్ది రోజులుగా కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయి. చేనేత పనులు సక్రమంగా జరగపోవడంతో కుటుంబ పోషణకై ఆనందరెడ్డి పలుచోట్ల అప్పులు చేశాడు. చేసిన అప్పులు సకాలంలో తీర్చలేకపోవడంతో రుణదాతల నుంచి ఒత్తిడి పెరిగింది. వేధింపులు ఎక్కువ కావడంతో జీవితంపై విరక్తి చెందిన ఆయన ఆదివారం రాత్రి ఇంటిలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చౌక బియ్యం పట్టివేత

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని రైస్ మిల్లులో విజిలెన్స్, రెవెన్యూ అధికారులు ఆదివారం అర్ధరాత్రి దాడులు నిర్వహించారు. అక్కడ ఉన్న 694 చౌక బియ్యం బస్తాలు స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ ఎం.ఎ.రమేష్ సోమవారం తెలిపారు. సుమారు రూ.13లక్షల విలువ గల చౌక బియ్యం పట్టుకు ని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

చెరకు తోట దగ్ధం


కాలిపోయిన చెరకు తోట

మైదుకూరు : మండలంలోని ఆదిరెడ్డిపల్లెలో సోమవారం శెట్టి లక్ష్మీ నారాయణ అనే రైతుకు చెందిన చెరకు తోట అగ్నికి ఆహుతి అయింది. ఆయన రెండెకరాల్లో సాగు చేసిన చెరకు పంట కొద్ది రోజుల్లో కోత కోయాల్సి ఉంది. సోమవారం నిప్పంటుకొని తోట కాలిపోయింది. మైదుకూరు నుంచి అగ్నిమాపక సిబ్బంది తోట వద్దకు చేరుకొని మంటలను ఆర్పివేశారు. అప్పటికే పంట మంటల్లో కాలిపోయింది. రైతు లక్ష్మీ నారాయణకు రూ.2 లక్షల నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది.

విద్యార్థిని అదృశ్యం

మైదుకూరు : పట్టణంలో ఓపెన్ ఇంటర్ పరీక్ష రాసేందుకు వచ్చి ఓ విద్యార్థిని కనిపించకుండా పోయిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు అర్బన్ హెడ్ కానిస్టేబుల్ రామచంద్ర సోమవారం తెలిపారు. వివరాలు.. చక్రాయపేట మండలం సురభి గ్రామానికి చెందిన విద్యార్థిని ఈ నెల మూడో తేదీన ఓపెన్ ఇంటర్ పరీక్ష రాసేందుకు మైదుకూరులోని ఓ పరీక్ష కేంద్రానికి వచ్చింది. పరీక్ష అనంతరం తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అన్ని చోట్లా వెతికారు. సోమవారం బాలిక తండ్రి వెంకటసుబ్బయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి బాలిక ఆచూకీ కోసం గాలిస్తున్నట్టు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

చెక్‌బౌన్స్ కేసులో జైలు

కడప అర్బన్ : చెక్‌బౌన్స్ కేసులో కుండా మహేశ్వర అనే వ్యక్తికి ఏడాదిపాటు జైలు శిక్ష, చెక్ మొత్తం రూ.9.47 లక్షలు చెల్లించాలని రెండవ అదనపు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ షేక్ రియాజ్ సోమవారం తీర్పునిచ్చారు. శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్, కడప వారి తరఫున న్యాయవాది పి.భరణీకుమార్ నాయుడు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చక్రాయపేటకు చెందిన కుండా మహేశ్వర అనే వ్యక్తి కడప శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్‌లో 2018లో రూ.25 లక్షల రుణం తీసుకున్నాడు. 60 కంతులలో రుణం మొత్తం చెల్లించాల్సి వుండగా, కొంత చెల్లించాడు. కంపెనీ వారి డిమాండ్ మేరకు రూ.9.47 లక్షలకు అలహాబాద్ బ్యాంకులో చెల్లుబాటు అయ్యే విధంగా 2019 నవంబర్ 18న చెక్కు ఇచ్చాడు. కంపెనీ వారు ఆ చెక్కును బ్యాంకులో వేయగా బౌన్స్ అయ్యింది. కావున సంస్థ వారు కోర్టులో కేసు దాఖలు చేశారు. కోర్టు వారు కేసు పూర్వాపరాలు విచారణ చేసిన తరువాత కుండా మహేశ్వర నేరం చేసినట్లుగా తేలింది. నిందితుడికి ఏడాది సాధారణ జైలు శిక్షతోపాటు చెక్ మొత్తం చెల్లించాలని కడప రెండవ అదనపు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ షేక్ రియాజ్ తీర్పు ఇచ్చారు. చెక్కు మొత్తం కట్టని పక్షంలో అదనంగా మూడు నెలల పాటు సాధారణ జైలు శిక్షను అనుభవించాలని ఆయన చెప్పారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో స్టేట్ బ్యాంక్ వద్ద సోమవారం గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. ఆయన నల్లచారల చొక్కా, నలుపు రంగు నిక్కరు ధరించి ఉన్నాడు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు.